ఉచిత కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం



ప్రారంభోత్సవంలో బానయ్య, టీడీడబ్ల్యూయూ నవనీత తదితరులు

నల్లకుంట: మహిళలకు స్వయం ఉపాధితో పాటు ఆర్థికంగా ఎదిగేందుకు టైలరింగ్‌ వృత్తి ఎంతగానో ఉపయోగపడుతుందని అతిథులు పేర్కొన్నారు. తెలంగాణ డొమెస్టిక్‌ వర్కర్స్‌ యూనియన్‌ (టీడీడబ్ల్యూయూ), బిజోస్‌ సంస్థ సంయుక్తాధ్వర్యంలో సోమవారం నల్లకుంట సంజయ్‌గాంధీనగర్‌లో ఉచిత టైలరింగ్‌ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. దీనికి హాజరైన బస్తీ నాయకుడు బానయ్య, టీడీడబ్ల్యూయూ కో–ఆర్డినేటర్‌ నవనీత, బిజోస్‌ సంస్థ ప్రతినిధి సుజాతతో కలిసి టైలరింగ్‌ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే సమాజంలో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పైచేయి సాధించగలరన్నారు. అందుకే నేటి మహిళలు వంటింటికే పరిమితం కాకుండా కుటుంబానికి చేదోడుగా ఉండేందుకు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీడీడబ్ల్యూయూ, బిజోస్‌ సంస్థ ఆధ్వర్యంలో మహిళల కోసం ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. టీడీడబ్ల్యూయూ కో–ఆర్డినేటర్‌ నవనీత, బిజోస్‌ సంస్థ ప్రతినిధి సుజాత మాట్లాడుతూ.. పలు బస్తీలలో కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి మహిళలకు కుట్టు, అల్లికల్లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీడీడబ్ల్యూయూ, విజోస్‌ సంస్థ ప్రతినిధులు కృష్ణవేణి, ప్రియాంక, కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



కాచిగూడ: లోక కల్యాణార్థం వర్షాలు సమృద్ధిగా పడాలని కోరుతూ.. ఆషాడమాస అమ్మవారి పూజలు సోమవారం బర్కత్‌పురలోని మహాకాళి దుర్గా వైష్ణవిదేవి, నల్లపోచమ్మ దేవాలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆగస్టు 11 వరకు 33 రోజుల పాటు శ్రీకాళి దుర్గా వైష్ణవి దేవీ మహాయంత్ర పూజ జరుగుతుందని నిర్వాహకులు రాజ్‌కుమార్‌ విగ్‌, డాక్టర్‌ కొండా శ్రీనివాస్‌రావు తెలిపారు. రోజూ ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అమ్మవారికి అర్చన, పూజ, హారతి ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పరామర్శ

ముషీరాబాద్‌: భోలక్‌పూర్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకుడు, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కె.శంకర్‌ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్‌ నాయకుడు ముఠా జైసింహ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. డివిజన్‌ అధ్యక్షుడు శ్రీనివాస్‌, రహీం, మహ్మద్‌ ఆలం, గోవింద్‌రాజ్‌, రాము, మహేష్‌, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌ నేత శంకర్‌ను పరామర్శిస్తున్న ముఠా జైసింహ

బ్రాహ్మణ పరిషత్‌ను పునరుద్ధరించాలి



గంపా రామారావు

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ పరిషత్‌ను పునరుద్ధరించి కార్పొరేషన్‌ నియమించాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్‌ఎస్‌) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సోమవారం నల్లకుంటలో టీబీఎస్‌ఎస్‌ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీబీఎస్‌ఎస్‌ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడిగా దేవులపల్లి బాలచందర్‌శర్మ, ప్రధాన కార్యదర్శిగా గంప రామారావులను నియమించారు. ఈ మేరకు రమణారావు వారికి నియామక పత్రాలను అందజేసి మాట్లాడారు. ప్రతిభావంతులైన పేద బ్రాహ్మణ విద్యార్థుల విదేశీ విద్య కోసం వివేకానంద స్కీమ్‌, బ్రాహ్మణ పరిషత్‌ ద్వారా మొదటి విడత ఫీజులు చెల్లించారని, సెకండ్‌ టర్మ్‌ ఫీజుల చెల్లింపులు నిలిచిపోయాయన్నారు. దీంతో విద్యార్థులు ఫీజులు చెల్లించలేక విదేశాల్లో ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని బ్రాహ్మణ పరిషత్‌ను పునః ప్రారంభించాలన్నారు. టీబీఎస్‌ఎస్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగారావు, ప్రధాన కార్యదర్శి మంత్రి సునిల్‌, రమాకుమార్‌, అశోక్‌ కుమార్‌, కె.రామారావు, ఖానాల శ్యామ్‌సుందర్‌రావు, లక్ష్మీనరసింహారావు, బాలచందర్‌శర్మ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి ఇద్దరి ఆత్మహత్య

సికింద్రాబాద్‌: రైలు కిందపడి ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు సికింద్రాబాద్‌ రైల్వే పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో సోమవారం జరిగాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి మీర్జాల్‌గూడకు చెందిన వేమవరపు వాసు (25) ప్రైవేట్‌ ఉద్యోగి. వాసు తల్లిదండ్రులు తొమ్మిదేళ్ల క్రితం విడిపోవడంతో తల్లితో కలిసి మీర్జాల్‌గూడలో ఉంటున్నాడు. అయితే ఉద్యోగంతో ఆశించిన ఆదాయం రావడం లేదని వ్యాపారం చేస్తానని రూ.5 లక్షలు కావాలని తన తల్లిని అడిగాడు. అంతమొత్తం సర్దుబాటు చేయలేనని తల్లి చెప్పడంతో 20 రోజుల క్రితమే వాసు ఇంటి నుంచి వెళ్లి మళ్లీ ఈ నెల 7న తిరిగి ఇంటికి వచ్చాడు. తన సెల్‌ఫోన్‌లో తల్లిఫొటోతో పాటు ద ఎండ్‌ అని స్టేటస్‌ పెట్టిన వాసు మల్కాజిగిరి–సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ల మధ్య గల ట్రాక్‌ వద్దకు చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

బొల్లారం రైల్వేస్టేషన్‌ రెండో నెంబర్‌ ప్లాట్‌ఫాం ట్రాక్‌పై మృతదేహం ఉన్నట్టు సోమవారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి వద్ద లభించిన గుర్తింపు కార్డు ద్వారా సదరు వ్యక్తి కొంపెల్లి పోచమ్మగడ్డకు చెందిన ఆలకుంట రవి (40)గా గుర్తించారు. హౌజ్‌కీపర్‌గా ప్రైవేట్‌ ఉద్యోగం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలను వారు విచారిస్తున్నారు.

కమ్యూనిటీ హాల్‌, పార్క్‌ స్థలాన్ని పరిరక్షించాలి

లాలాపేట: లాలాపేట కమాన్‌ పక్కనున్న జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌ (భారత్‌ యూత్‌ క్లబ్‌), పార్క్‌ స్థలాన్ని పరిరక్షించాలని బీజేపీ స్టేట్‌ కౌన్సిల్‌ మెంబర్‌ పోచయ్యయాదవ్‌ కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జీహెచ్‌ఎంసీ జోనల్‌ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారని ఆయన తెలిపారు.

పీస్‌ కమిటీ సమావేశం

బౌద్ధనగర్‌: బోనాల పండుగ సందర్భంగా వారాసిగూడ ఇన్‌స్పెక్టర్‌ సైదులు పీస్‌ కమిటీ, ఆలయాల నిర్వాహకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అమ్మవారి దర్శనం, బోనాల సమర్పణకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తొట్టెల, ఫలహార బండ్ల ఊరేగింపులకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. వివిధ ఆలయాల ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఎస్పీ నేతలు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–5లోని దేవరకొండ బస్తీకి వెళ్లే రోడ్డులో ఓ రియల్‌ఎస్టేట్‌ కంపెనీ తమ స్థలాన్ని అనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుందని, వారిపై చర్యలు తీసుకుని స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఖైరతాబాద్‌ నియోజకవర్గం బీఎస్పీ అధ్యక్షుడు దూరపల్లి రమేష్‌ సోమవారం షేక్‌పేట తహసీల్దార్‌ అనితారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇటీవలనే ఈ స్థలంలో ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారని, సదరు కబ్జాదారుడు మాత్రం ఆ స్థలంలో రాళ్లు కొడుతూ చదును చేస్తున్నారని, ఈ స్థలాన్ని కాపాడాలని కోరారు. బీఎస్పీ నేతలు రమేష్‌, తదితరులు పాల్గొన్నారు.

పాన్‌ షాప్‌ నిర్వాహకుడి అదృశ్యం

వెంగళరావునగర్‌: దుకాణానికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. మధురానగర్‌ పోలీసుల సమాచారం మేరకు... జవహర్‌నగర్‌లోని మహ్మద్‌ మజహర్‌ రహమత్‌నగర్‌ చౌరస్తాలో పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. రెండురోజులుగా అతను షాపునకు వెళ్లడం లేదు. ఈ విషయంపై భార్య ఆయేషా సుల్తానా ప్రశ్నించడంతో ఈ నెల 8న షాపునకంటూ బ్యాగులో జత బట్టలు, దుప్పటి తీసుకెళ్లాడు. తిరిగి రాకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రాజన్న హయాంలో సంక్షేమ రాజ్యం



నగర కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి మహేష్‌ యాదవ్‌

కాచిగూడ: ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోయేలా వారి అభిమానాన్ని చూరగొన్న మహానేత డాక్టర్‌ వైఎస్‌. రాజశేఖర్‌రెడ్డి అని సీనియర్‌ కాంగ్రెస్‌ నేత ఎడ్ల నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్‌ఆర్‌ జయంతి సందర్భంగా కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలను పరిపాలించే నాయకుడు వారి సమస్యలను తెలుసుకోవాలని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సమస్యలను తీర్చగలిగే నిబద్ధత కలిగి ఉండాలన్నారు. అలాంటి వ్యక్తిత్వం, గొప్ప మనసు కలిగిన వ్యక్తి వైఎస్‌ రాజశేఖర్‌ రెడ్డి అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాలేరు శ్రీనివాస్‌రావు, జగన్‌, శ్రీహరి, పరమేష్‌, కిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌గుండు వద్ద..

ముషీరాబాద్‌: దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి సందర్భంగా రాంనగర్‌ గుండు వద్ద వైఎస్‌ఆర్‌ విగ్రహానికి సోమవారం పాలాభిషేకం చేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. జగదీశ్వర్‌గుప్తా, విలియమ్స్‌, ఎలిజబెత్‌ రాణి, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో నిలిచిన మహానేత..

కాచిగూడ: భూమి, ఆకాశం ఉన్నంత వరకు వైఎస్‌. రాజశేఖర్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచే ఉంటారని సీనియర్‌ కాంగ్రెస్‌ నేత బొమ్మిడి శ్రవణ్‌ కుమార్‌, అంతర్జాతీయ వైశ్య సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వాసవి ఆర్ట్‌ థియేటర్స్‌ అధ్యక్షుడు డాక్టర్‌ నీలా శ్రీధర్‌ అన్నారు. వైఎస్‌ఆర్‌ జయంతి సందర్భంగా సోమవారం నారాయణగూడలో ఆయన చిత్రపటానికి పలువురు కాంగ్రెస్‌ నేతలు ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన అందించిన గొప్ప మానవతావాది వైఎస్‌. రాజశేఖర్‌రెడ్డి అని పేర్కొన్నారు. 'ప్రజాప్రస్థానం' పేరుతో వేలాది కిలోమీటర్లు ఆయన చేసిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయిందన్నారు. రైతులకు ఉచిత విద్యుత్‌, ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం, 108, రూ.2కిలోబియ్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలను తీసుకుని ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. సీనియర్‌ కాంగ్రెస్‌ నేతలు మురళీకృష్ణ, రాజేందర్‌ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌ నేతలు బొమ్మిడి శ్రవణ్‌కుమార్‌, డాక్టర్‌ నీలా శ్రీధర్‌

వైఎస్సార్‌ ఆశయసాధనకు కృషి..

కాచిగూడ: సంక్షేమ ప్రదాత.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్‌ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి ఎం.మహేష్‌ యాదవ్‌ పిలుపునిచ్చారు. వైఎస్‌ఆర్‌ జయంతి సందర్భంగా సోమవారం కాచిగూడకు చెందిన కాంగ్రెస్‌ పార్టీ నేతలు ర్యాలీగా తరలివెళ్లి పంజాగుట్టలోని వైఎస్‌ఆర్‌ విగ్రహానికి పాలాభిషేకం చేసి, ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల ప్రజలకు వైఎస్‌ఆర్‌ చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయన్నారు ఆయన హయాంలోనే అనేక సంక్షేమ పథకాలు అమలయ్యాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పార్టీ నేతలు రవికుమార్‌, సత్య, నరసింహగుప్తా తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్‌ గుండు వద్ద నివాళులర్పిస్తున్న బెటినా, జగదీశ్వర్‌గుప్తా

విద్యార్థి అదృశ్యం

కాచిగూడ: విద్యార్థి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ కె.చంద్రకుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. చెప్పల్‌బజార్‌కు చెందిన రాజేష్‌కుమార్‌ జైన్‌ కుమారుడు జతిన్‌ జైన్‌ (22) డిగ్రీ చదువుతున్నాడు. సోమవారం నిద్రలేచి చూసేసరికి కుమారుడు కనబడలేదని, ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ చేసి ఉందని, పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెంబర్‌ప్లేట్‌ లేని వాహనదారులపై కేసు..

కాచిగూడ: నెంబర్‌ ప్లేట్‌ లేకుండా వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్‌ కె.చంద్రకుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి కాచిగూడ రైల్వే స్టేషన్‌ వద్ద ప్రత్యేక డ్రైవ్‌ నిర్వహిస్తుండగా.. నెంబర్‌ ప్లేట్‌ లేకుండా వాహనాలు నడుపుతున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

రైలు ఢీకొని చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్‌ ఆర్‌.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 24న ఫలక్‌నుమా – బుద్వేల్‌ రైల్వేస్టేషన్ల మధ్య అత్తాపూర్‌కు చెందిన భద్రం కుమారుడు పెయింటర్‌ అరుణ్‌ (33) పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

కట్టమైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు

చిలకలగూడ: చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ ఆలయ హుండీని ఈఓ మహేందర్‌గౌడ్‌, కార్పొరేటర్‌ సామల హేమ పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో సోమవారం లెక్కించారు. మూడు నెలలకు రూ. 1.24 లక్షల ఆదాయం సమకూరగా బ్యాంక్‌లో జమచేసినట్లు ఈఓ తెలిపారు. ఆలయ ట్రస్ట్‌ బోర్డు సభ్యులు దేవేందర్‌యాదవ్‌, జగన్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు సాయియాదవ్‌, మురళీ, ఎక్స్‌అఫీషియో సభ్యుడు, ఆలయ ప్రధాన అర్చకుడు తిరుమలాచార్యులు, భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టుచీర సమర్పణ

అమీర్‌పేట: అమీర్‌పేట మాజీ కార్పొరేటర్‌ నామన శేషుకుమారి ఎల్లమ్మ అమ్మవారి కల్యాణానికి పట్టుచీర, ఒడి బియ్యం, పసుపు, కుంకుమను సోమవారం బహూకరించారు. ముందుగా ఉదయం గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులకు వాటిని అందజేశారు.

చెక్కుల పంపిణీ

కంటోన్మెంట్‌: తహసీల్‌ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే శ్రీగణేష్‌ మారేడుపల్లి మండల పరిధిలోని 8 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను సోమవారం అందజేశారు. మారేడుపల్లి తహసీల్దార్‌ (ఇన్‌చార్జి) అశోక్‌ కుమార్‌, డిప్యూటీ తహసీల్దార్‌ శివకుమార్‌, సంతోష్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

'ఆరోగ్య పరీక్షల పేరిట దోపిడీపై విచారణ జరపాలి'



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ముషీరాబాద్‌: రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు ఆరోగ్య పరీక్షల పేరిట జరుగుతున్న భారీ దోపిడీపై విచారణ జరిపించాలని సీపీఎం గ్రేటర్‌ హైదరాబాద్‌ సెంట్రల్‌ సిటీ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 2022లో సీఎస్సీ హెల్త్‌ కేర్‌ వెల్‌నెస్‌ సర్వీసెస్‌ లిమిటెడ్‌ అనే సంస్థకు ఎలాంటి టెండర్‌ లేకుండానే కాంట్రాక్టు ఇచ్చారని ఆరోపించారు. ఒక్కో కార్మికుడికి ఆరోగ్య పరీక్షల నిమిత్తం రూ.3256 చొప్పున ఆ సంస్థకు భవన ఇతర నిర్మాణ కార్మికుల వెల్ఫేర్‌ బోర్డు చెల్లించాలని జీవో ఇచ్చారన్నారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకుండా లెక్కలు రాసి బిల్లులు తీసుకోవడం సరికాదన్నారు. రాష్ట్రంలో 14 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉండగా.. ఇప్పటి వరకు 11 లక్షల మందికి పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు చెప్తారన్నారు. తాజాగా కార్మికులకే కాకుండా వారి కుటుంబాలకు కూడా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారని కార్మికశాఖ అధికారులు, కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై కార్మికశాఖ నిధులు దోచుకుంటున్నారని విమర్శించారు. ఈ దోపిడీపై విచారణ జరిపించాలని శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. నగర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రావు, మహేందర్‌, మధు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు



కమ్యూనిటీహాల్‌ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం

సనత్‌నగర్‌: అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం తగదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బేగంపేట డివిజన్‌లో వివిధ విభాగాల అధికారులతో కలిసి సోమవారం పర్యటించారు. శ్యాంలాల్‌బిల్డింగ్స్‌ తాతాచారి కాలనీ కమ్యూనిటీ హాల్‌, ఎరుకల బస్తీ కమ్యూనిటీ హాల్‌, అంబేద్కర్‌నగర్‌ కమ్యూనిటీ హాళ్ల పనులు, మాతాజీనగర్‌లో డ్రైనేజీ, రోడ్ల పనులను పరిశీలించారు. అనంతరం డివిజన్‌ పరిధిలోని పలు అసోసియేషన్ల ప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేసి అసోసియేషన్లకు స్వాధీనం చేయాలన్నారు. బేగంపేట కార్పొరేటర్‌ మహేశ్వరి, జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ సమ్మయ్య, ఈఈ సుదర్శన్‌, నాయకులు శ్రీహరి, సురేశ్‌యాదవ్‌, నరేశ్‌, ప్రవీణ్‌ పాల్గొన్నారు.

జహంగీర్‌కు పరామర్శ..

ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కాలు కోల్పోయిన సీనియర్‌ కార్యకర్త జహంగీర్‌ను ఎమ్మెల్యే కృష్ణారావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్‌ అండగా ఉంటుందని, ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలి

- ఖైరతాబాద్‌ జోనల్‌ కమిషనర్‌ అనురాగ్‌ జయంతి



దుర్గాభవానీనగర్‌ బస్తీలో పర్యటిస్తున్న జెడ్‌సీ అనురాగ్‌ జయంతి

ఫిలింనగర్‌: పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే దుర్గంధం, దుర్వాసనలు, దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తాయని, ప్రజలు అనారోగ్యం బారినపడతారని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్‌ జోనల్‌ కమిషనర్‌ అనురాగ్‌ జయంతి సూచించారు. సోమవారం ఆయన జూబ్లీహిల్స్‌ డివిజన్‌ పరిధిలోని ఫిలింనగర్‌, దీన్‌దయాళ్‌నగర్‌, బండారు బాల్‌రెడ్డిరెడ్డినగర్‌, దుర్గాభవానీనగర్‌ బస్తీల్లో పర్యటించి ఇంటింటికి చెత్తను సేకరించే విధానంపై ఆరాతీశారు. స్వచ్ఛ ఆటోలకు ఇంటి వద్ద నుంచే చెత్తను అందించాలని, రోడ్ల పక్కన కుప్పలుగా పోయవద్దని సూచించారు. తరచూ చెత్తను పేరుకుపోతున్న జీవీపీలు లేకుండా పూర్తిగా నిర్మూలించాలని ఎస్‌ఎఫ్‌ఏలకు సూచించారు. శానిటేషన్‌ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎప్పటికప్పుడు చెత్తను తొలగించే విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్కిల్‌–18 డీఎంసీ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

'చలో కలెక్టరేట్‌'ను విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సునీల్‌

రహమత్‌నగర్‌: పెండింగ్‌ స్కాలర్‌ షిప్పులు, ఫీజు రీయింబర్‌మెంట్స్‌ నిధులను తక్షణమే విడుదల చేయాలనే డిమాండ్‌తో విద్యార్థి సంఘాలు ఈ నెల 11, 12వ తేదీల్లో నిర్వహించే కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ జూబ్లీహిల్స్‌ కార్యదర్శి సునీల్‌ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు లెనిన్‌, శ్రీమాన్‌, ప్రశాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



బాగ్‌ అంబర్‌పేట్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు జాప్యం లేకుండా పరిష్కారించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ అధికారులకు సూచించారు. సోమవారం బాగ్‌ అంబర్‌పేట డివిజన్‌లో పోచమ్మ బస్తీ, కుర్మ బస్తీ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్‌ పద్మావెంకట్‌రెడ్డి, అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర చేశారు. అంతర్గత రోడ్ల మరమ్మతులు, విద్యుత్‌ దీపాలు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆయన తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మౌలిక సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దని ఆయన తెలిపారు. ఏఎంహెచ్‌ఓ డాక్టర్‌ హేమలత, డీఈ ప్రవీణ్‌, ఏఈలు సౌమ్య, మజీద్‌లతో పాటు బీఆర్‌ఎస్‌ నాయకులు చంద్రమోహన్‌, రమేష్‌ తదితరులున్నారు.

వరద నీటి కాలువకు మరమ్మతులు



మరమ్మతు పనులు చేయిస్తున్న కార్పొరేటర్‌ కన్నె ఉమారమేష్‌యాదవ్‌

కాచిగూడ: వర్షం వచ్చినప్పుడు రోడ్లపై నీరు నిలవకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన వరదనీటి కాలువలకు సోమవారం కాచిగూడ కార్పొరేటర్‌ కన్నె ఉమారమేష్‌యాదవ్‌ మరమ్మతులు చేయించారు. జీహెచ్‌ఎంసీ డీఈఈ రఘు, ఏఈ విశ్వతేజలతో కలిసి ఆమె పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు ఎందుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నింబోలిఅడ్డ నుంచి రహమత్‌బాగ్‌ మీదుగా చెప్పల్‌బజార్‌కు వెళ్లే రోడ్డులో వర్షం కారణంగా వరదనీరు రోడ్లపై నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా స్టామ్‌వాటర్‌ డ్రెయిన్‌లకు నూతనంగా క్యాష్‌పిట్‌లను ఏర్పాటు చేయించారు. కచ్చా మోరీలపై మ్యాన్‌హోల్స్‌ వద్ద డిస్టిలింగ్‌ పనులు చేపట్టాలని అధికారులకు ఆమె సూచించారు. బీజేపీ నేతలు కన్నె రమేష్‌ యాదవ్‌, లావణ్య, బాల ప్రసాద్‌, బాబన్న, రవియాదవ్‌, క్రిష్ణ తదితరులున్నారు.

డీఎస్సీ అభ్యర్థుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం



మహేష్‌, పీడీఎస్‌యూ నేత

ముషీరాబాద్‌: డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని 'డైరెక్టరేట్‌ ఆఫ్‌ స్కూల్‌ ఎడ్యుకేషన్‌' కార్యాలయ ముట్టడికి యత్నించిన అభ్యర్థుల అరెస్టు సరికాదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరెస్టులు, నిర్బంధాలతో సమస్యలు పరిష్కారం కాదని ప్రభుత్వం గుర్తించాలన్నారు. వరుసగా పోటీ పరీక్షలు ఉండటం వల్ల తగినంత సమయం ఉండాలని, నిరుద్యోగ అభ్యర్థులు కోరుతున్నారన్నారు. అభ్యర్థుల న్యాయమైన డిమాండ్లను పరిగణలోకి తీసుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌ పార్టీ విద్యార్థి, యువజన నాయకులతో కాకుండా నేరుగా డీఎస్సీ అభ్యర్థులతో చర్చించి సమస్యను పరిష్కరించాలన్నారు. పరీక్షను వెంటనే 45 రోజుల పాటు వాయిదా వేయిదా వేయాలని కోరారు.

సేవారత్న అవార్డు గ్రహీతకు అభినందన



ఐజాక్‌రాజ్‌ను అభినందిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

నల్లకుంట: 'జాతీయ సేవా రత్న అవార్డు' గ్రహీత నల్లకుంటకు చెందిన బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్‌, ఇండియన్‌ రెడ్‌ క్రాస్‌ సొసైటీ హైదరాబాద్‌ మీడియా ఇన్‌చార్జి ఎం. ఐజాక్‌రాజ్‌ సోమవారం కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. తాను చేపడుతున్న సేవా కార్యక్రమాలను కేంద్ర మంత్రికి తీసుకెళ్లగా.. ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ స్ఫూర్తితోనే బాధ్యత మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఐజాక్‌రాజ్‌కు సూచించారు.

నేతలతో కేంద్రమంత్రి సమావేశం

సనత్‌నగర్‌: బర్కత్‌పురలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సనత్‌నగర్‌ నియోజకవర్గ పార్టీ నేతలతో సోమవారం సమావేశం నిర్వహించారు. సీనియర్‌ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, మహంకాళి–సికింద్రాబాద్‌ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్‌, సెంట్రల్‌ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, పార్లమెంట్‌ కన్వీనర్‌ రాజశేఖరరెడ్డి, రాష్ట్ర యువ నాయకుడు మర్రి పురురవరెడ్డితో పాటు కార్పొరేటర్లు, నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కిషన్‌రెడ్డికి శాలువాలు కప్పి సన్మానించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సత్కారం

సికింద్రాబాద్‌: హైదరాబాద్‌ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను లష్కర్‌ జిల్లా సాధన సమితి ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బోనాల నిర్వహణకు రూ.20 కోట్లు విడుదల చేయించడంతో సాధన సమితి సభ్యులు మంత్రిని సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి తప్రతినిధులు సాదం బాల్‌రాజ్‌యాదవ్‌, శైలేందర్‌, జగదీశ్‌గౌడ్‌, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణముదిరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

నాలా అభివృద్ధికి నిధులు మంజూరు

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్‌లో నాలా అభివృద్ధి పనులకు రూ. 9.5 కోట్ల నిధులు మంజూరైనట్లు కార్పొరేటర్‌ సామల హేమ తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్‌ అధికారులతో కలిసి భవానీనగర్‌ నుంచి మహ్మద్‌గూడ వరకు నాలా పరీవాహక ప్రాంతాల్లో సోమవారం ఆమె పర్యటించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఏఈ కౌషిక్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు గడ్డం అశోక్‌, మురళీ, సాయియాదవ్‌, లక్ష్మి పాల్గొన్నారు.